ప్రజాశక్తి
బుధవారం 10 జులై 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

ధరలను అందుబాటులోకి తెస్తాం..

- 11 నుంచి ప్రత్యేక కౌంటర్ల ద్వారా నిత్యావసర సరుకులు విక్రయం
- కలెక్టర్ వెంకట మురళి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నిత్యావసర సరుకుల ధరలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. రైస్, డాల్ మిల్లర్ల అసోసియేషన్ నాయకులతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగింది. నిత్యావసర సరుకుల ధరల తగ్గింపుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రస్థాయి మిల్లర్ల అసోసియేషన్‌తో సమావేశమై ధరల నియంత్రణపై చర్చించారన్నారు. ఆ మేరకు ధరలను తగ్గించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. అందులో భాగంగా జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ధరల తగ్గింపుపై సుధీర్ఘంగా చర్చించారు. రారైస్ ఒక కిలో ధర రూ.48, స్టీమ్ రైస్ ఒక కిలో రూ.49 ధరగా నిర్ణయించి విక్రయించాలన్నారు. కందిపప్పు ఒక కిలో రూ.160 ధర నిర్ణయించి విక్రయించాలన్నారు. జిల్లా అసోసియేషన్ నాయకులంతా అంశాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడంతో ఈనెల 11వ తేదీ నుంచి ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయించనున్నట్లు ఆయన ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా బాపట్ల, చీరాల, అద్దంకి, పర్చూరు, రేపల్లె, వేమూరు ప్రాంతాలలోనూ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. నిత్యవసర సరుకులు బయట మార్కెట్లో అధిక ధరలు ఉన్నందున ధరలు తగ్గేవరకు ప్రత్యేక కౌంటర్లు కొనసాగుతాయన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేయడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కృత్రిమ కొరత, డిమాండ్ సష్టించి ధరలు పెంచి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకట మురళి స్పష్టం చేశారు. నిత్యావసర సరుకులు అక్రమంగా నిల్వ చేయడం ▶ 2లో

'అధికారం' వైపే చూపు..

- వైసిపి స్థానిక ప్రజాప్రతినిధుల్లో ఇదే యోచన
- ఇప్పటికే చీరాలలో అధికార పార్టీలో చేరిన పది మంది కౌన్సిలర్లు
- ఒంగోలులోనూ పలువురు కార్పొరేటర్లు పార్టీ మారతారని ప్రచారం..
- ప్రతిపక్షంగా ప్రభుత్వంపై పోరాడాలనే స్పృహ శూన్యం



చీరాలలో టిడిపిలో చేరిన వైసిపి కౌన్సిలర్లు (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రాష్ట్రంలో అధికారం మారింది. వైసిపి ఓడిపోయింది. కూటమి అధికారంలోకి వచ్చింది. అధికారం మారగానే అందరి ఆలోచన దానివైపే ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులు ఏ పార్టీ అధికారంలో ఉంటే దాంట్లోకి జంప్ చేయడం ఆనవాయితీగా మారుతోంది. అధికారం లేకుంటే ఏమీ చేయలేమనే భావనలోకి పోతున్నారు. ఎందుకంటే స్థానికసంస్థల్లో పోటీ చేసి గెలిచిన ప్రజాప్రతినిధులందరూ ఏదో రకమైన వ్యాపారాలు, కాంట్రాక్టర్లు, ఇతర ఆర్థిక వ్యవహారాలతో ముడిపడి ఉన్నారు. అధికారంలో లేకుంటే వారి ఆర్థిక పునాదులే దెబ్బ తింటాయి. అందుకే వాటిని కాపాడుకునేందుకు జంప్ చేయడం అనివార్యమైంది. ఒక్కరంటే ఒక్కరూ రాజకీయమే వృత్తిగా ఉన్న నేతలు కనిపించడం లేదు. ఏదో వ్యాపారాల్లో సంపాదించుకొని రాజకీయాల్లోకి వస్తున్నారు. ఎన్నికల్లో ఓటుకు రూ.వెయ్యి లేదా రూ.2 వేలు ఇచ్చేవారికే ప్రధాన పార్టీలు టిక్కెట్లు ఇస్తున్నాయి. వారే గెలుస్తున్నారు. అధికారంలోకి రాగానే వారి వ్యాపారాలు రెట్టింపు చేసుకుంటున్నారు. తిరిగి అదే డబ్బును మళ్లీ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా పోటీ చేసి ఖర్చు పెడుతున్నారు. ఇప్పుడున్న రాజకీయ నేతలందరూ ఇదే దారిలో ఉన్నారు. ఎమ్మెల్యేలు మొదలు పంచాయతీల్లో వార్డుల్లో పోటీ చేసే చిన్న నేతల వరకూ డబ్బులేకుండా పోటీచేసే పరిస్థితి ఇప్పుడైతే కనిపించడం లేదు. ఈ తరహా రాజకీయాల వల్ల ప్రజల కోసం పనిచేసే వామపక్షాల నుంచి పోటీ చేసినా నేతలకు ఓట్లు పడటం లేదు. ప్రజల కోసం పనిచేస్తారనే చర్చ ఉన్నా ఆఖరులో ఎవరు డబ్బులిస్తే వారికే ఓట్లేస్తున్నారు. ఇలా రాజకీయాలు, పార్టీల స్వభావాలే మారిపోయాయి. ఇప్పుడు అధికారం మారగానే వైసిపి నుంచి గెలిచిన స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల్లో ఉన్నవాళ్లు మళ్లీ తెలుగుదేశం వైపు చూస్తున్నారు. చీరాలలో ఇప్పటికే 10 మంది వైసిపి కౌన్సిలర్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సమక్షంలో తెలుగుదేశంలో చేరారు. ఎందుకంటే ▶ 2లో

రోగులకు మెరుగైన వైద్యసేవలు

- వైద్యులు, సిబ్బంది సత్ప్రవర్తన కలిగి ఉండాలి
- అనుమతి లేకుండా సెలవు పెడితే కఠిన చర్యలు
- వైద్యాధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వారితో సత్ప్రవర్తన కలిగి ఉండడం చాలా కీలకమని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. మంగళవారం ప్రకాశం భవనంలో ఆమె వైద్య శాఖలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ పంక్షేమ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు అందజేస్తున్న సేవలు, ఇందు కోసం విభాగాల వారీగా ఉన్న సిబ్బంది వివరాలపై ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రులలో పారిశుధ్యం, సెక్యూరిటీ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని, వైద్యులు ఎవరైనా అనుమతి లేకుండా సెలవు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. రోగుల కోసం టాయిలెట్లు, తాగు నీరు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో తీసుకున్న నిర్ణయాలు, ఇచ్చిన ఆదేశాలు కేవలం కాగితాలపైనే మిగిలిపోకుండా క్షేత్రస్థాయిలో అవి అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ఆయా విభాగాల ఉన్నతాధికారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉన్న సిబ్బందిని సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.సురేష్‌కుమార్, డిసిహెచ్‌ఎస్ శేషుకుమార్, డిఐఒ పద్మజ, ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావు, డిప్యూటీ సూపరింటెండెంట్లు ప్రభాకర్, బాలాజీ నాయక్, మార్కాపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజమన్నార్, సూపరింటెండెంట్ సావిత్రి, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.హేమంత్ కుమార్, జిల్లా మలేరియా అధికారి మాధవీలత, డిప్యూటీ డిఎం,హెచ్‌ఒలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యాశాఖపై సమీక్ష

అనంతరం విద్యాశాఖ పనితీరుపై కలెక్టర్ సమీక్షించారు. అకడమిక్, ఎస్టాబ్లిష్‌మెంట్ కార్యకలాపాలు, విద్యాలయాలలో చేపడుతున్న నిర్మాణాలు, ఎడ్యుకేషన్ కార్యకలాపాలతో పాటు వివిధ యాజమాన్యాలలో ఉన్న పాఠశాలల వివరాలు, వాటిలోని విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, తాగునీరు, పారిశుధ్యం, ప్రహరీగోడ వంటి అంశాలకు సంబంధించిన వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడి వయస్సు పిల్లలందరూ బడిలో ఉండేలా చూడాలని, వారికి నాణ్యమైన విద్య అందించాలని అధికారులను ఆమె ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర, డిప్యూటీ విద్యాధికారులు అనితారోజ్ రాణి, చంద్ర మౌళీశ్వర్, ఏపిఈడబ్ల్యుఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, భాస్కర్ బాబు, సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు మన్నయ్య, గర్ల్ చైల్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మాధవీలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాతృమరణాల నివారణకు చర్యలు

- గర్భిణులకు సరైన వైద్యసేవలందించాలి
- అధికారులకు డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.సురేష్‌కుమార్ ఆదేశం

సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్సీ

అవార్డు పొందడం గర్వకారణం

ఎస్పీ వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అంకితభావంతో విధులు నిర్వహించే వారికి అవార్డులు వరిస్తాయని, దానికి నిదర్శనమే జిల్లా పోలీస్ యంత్రాంగం అందుకున్న సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్సి అవార్డు అని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం వారు జిల్లా పోలీస్ శాఖకు జారీచేసిన సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డును మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఏస్.బి ఇన్స్‌పెక్టర్ వి.మల్లికార్జునకి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వారు ప్రతి సంవత్సరం పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ విభాగం నందు ప్రజలకు వేగవంతంగా, అత్యుత్తమ, నాణ్యమైన సేవలు అందించినందుకు గానూ సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డును ఇస్తారన్నారు. ఈ సంవత్సరం బాపట్ల జిల్లాలోని ఏస్.బి విభాగం పాస్‌పోర్ట్‌ల విచారణలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచినందుకు గానూ విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం వారు బాపట్ల జిల్లా పోలీస్ శాఖకు సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డు అందించడం జరిగిందన్నారు. ఈ అవార్డు అందుకోవడం బాపట్ల జిల్లా పోలీస్ శాఖకు ఎంతో గర్వకారణమని తెలిపారు. ఇటువంటి అవార్డులను సమిష్టి కృషితోనే సాధించగలమన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏస్.బి యంత్రాంగానికి క్రమపద్ధతిలో తగిన ఉత్తర్వులు ఇస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహించగలిగే విధంగా తయారుచెయ్యడంలో జిల్లా ఏస్.బి అధికారి మల్లికార్జున పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో ఇతర అధికారులు కూడా విధులు నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.



మల్లికార్జునకు అవార్డు అందజేస్తున్న ఎస్పి

ధరలను అందుబాటులోకి తెస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జనాభాలో 85 శాతం పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నందున ధరల తగ్గింపునకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మిల్లర్ల యజమానులంతా సహృదయంతో ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ప్రభుత్వమే జోక్యం చేసుకుని ధరలు తగ్గించడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని వివరించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విలియమ్స్, మార్కెటింగ్ శాఖ అధికారి రమేష్ బాబు, మిల్లర్ల అసోసియేషన్ నాయకులు గుప్తా, శ్రీనివాసరావు, హనుమంతరావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి: కమిషనర్

ప్రజాశక్తి-చీరాల: మున్సిపల్ అభివృద్ధికి రెవెన్యూ సిబ్బంది అందరూ సహకరించాలని, సకాలంలో పనులను వసూలు చేసి మున్సిపల్ అభివద్ధికి తోడ్పాటు అందించాలని కమిషనర్ చక్రవర్తి అన్నారు. మంగళవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో కమీషనరు చాంబరులో కమీషనరు కె చక్రవర్తి రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. సదరు సమావేశంలో చీరాల పురపాలక సంఘానికి సంబంధించి ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్నులు వసూలు త్వరితగతిన పూర్తి చేయవలసినదిగా, మార్కెట్లకు సంబంధించి లీజులు, షాపు రూములకు సంబంధించి అద్దెలు ఆలస్యం లేకుండా వసూలు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ అధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

'అధికారం' వైపే చూపు..

(మొదటిపేజీ తరువాయి)

అక్కడ ఉంటే ఉపయోగం లేదన్నదే వారి ఆలోచన. ఆర్థికంగా నష్టపోతామనే ఆలోచనతో జంప్ చేశారు. ఇదే దారిలో ఒంగోలులోనూ పలువురు కార్పొరేటర్లున్నారు. మేయర్ కూడా తెలుగుదేశం వైపు చూస్తున్నారనే చర్చ సాగుతోంది. ఇప్పటికే ఆమె తెలుగుదేశం నేతలతో టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. ఎమ్మెల్యే దామచర్ల నుంచి గ్రీన్‌సిగ్నల్ రానందునే ప్రస్తుతం వేచిచూసే ధోరణిలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. తన పదవిని కాపాడుకునేందుకు జంప్ అనివార్యమైందనే చర్చ ఉంది. పలువురు కార్పొరేటర్లు కూడా ఇదే పనిలో ఉన్నారు. ఎన్నికలకు ముందే రాజకీయ పరిస్థితిని అంచనా వేసుకున్న కొందరు కార్పొరేటర్లు పార్టీ మారారు. ఇప్పుడు మేయర్, ఉప మేయర్లపైనే చర్చ సాగుతోంది. వైఎస్ఆర్ జయంతి కార్యక్రమానికి ఒంగోలులో కీలక నేతలందరూ డుమ్మా కొట్టారు. పార్టీకి 43 మంది కార్పొరేటర్లుంటే మేయర్ సహా చాలా మంది రాలేదు. నలుగురైదుగురు మాత్రమే కనిపించారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డే రాకపోతే తామెంత అంటున్నారు. అద్దంకిలోనూ ఎన్నికల సమయంలో ఒకరిద్దరు వచ్చారు. ఇప్పుడూ చాలా మంది పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నారు. మిగతా మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లో పార్టీలు మారేందుకు సన్నాహాల్లో ఉన్నారు. మండలాల్లోనూ ఇదే ధోరణి ఉంది. ఇప్పటికే నలుగురు జడ్పీటీసీలు ఎన్నికల సమయంలో వైసిపిని వీడి తెలుగుదేశంలో చేరారు. ఇప్పుడు పలువురు ఇదే దారిలో ఉన్నారు. ఎమ్మెల్యేలతో సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఎన్నికల్లో గట్టిగా పనిచేసిన నేతలు పెద్దగా ముందుకు రాకపోయినా ఊగిసలాటగా పనిచేసిన వారంతా ఇప్పుడు అధికారం వైపు చూస్తున్నారు. ఎంతమంది నిలుస్తారన్నదే ప్రశ్నగా మారింది. వైసిపిలో ఉంటే రాజకీయంగా ఇబ్బందులు, కేసులు తప్పవనే భయం కూడా వెంటాడుతోంది. ఇక రానురానూ ప్రతిపక్షంగా ఉండి ప్రజల కోసం పోరాడాలనే స్పృహ కూడా ఎన్నికల్లో ఓడిపోయిన వైసిపిలో కనిపించడం లేదు. అభ్యర్థులే సక్రమంగా కనిపించడం లేదు. ఇక క్యాడర్ ఎలా నిలబడతారన్నదే ప్రశ్నగా మారింది. రాజకీయాల్లోకి వ్యాపారులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, కాంట్రాక్టర్లు, గనుల యజమానులు, మద్యం, ఇసుక వ్యాపారాలతో కోట్లు గడించిన నేతలు పోటీ చేస్తే పార్టీల భవితవ్యం ఇలాగే ఉంటుందని ఇప్పటికైనా ప్రధాన రాజకీయ పార్టీలు గుర్తించాలి.



మాట్లాడుతున్న అడకా స్వాములు

ఇసుక పాలసీ అభినందనీయం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని తీసుకురావటం అభినందనీయమని టిడిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడకా స్వాములు, టిడిపి మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం కార్యకర్తలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం వల్ల సామాన్యులకు భారీ ఊరట లభించిందన్నారు. గత ఎన్నికలలో ఇచ్చిన హామీ ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన నెలలో అమలులోకి తెచ్చారని అన్నారు. ఇసుక పాలసీని అమలు చేస్తూ జీవో నెంబర్ 43 విడుదల చేయటం బడుగు బలహీన వర్గాల అభ్యున్న తికి రాష్ట్ర ప్రగతికి బాటలు వేయడమేనని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇసుక మాఫియా ను నడిపిందని, ఇసుక కుంభకోణం ద్వారా 50 వేల కోట్లకు పైగా వైసిపి నేతలే ఇసుకాసుర అవతారం ఎత్తి దోచుకున్నారని అన్నారు. పేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు అయితే రూ.3 లక్షల ఖర్చు ఇసుకకే అయిందని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ పేరుతో 98 లక్షల టన్నుల ఇసుకను జగన్ అండ్ కో మింగేశారన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలు నిరోధిస్తూ రాష్ట్ర ప్రగతే ధ్యేయంగా ఈ పాలసీని రూపొందించారన్నారు. దీనిపై నిరంతరం విజిలెన్స్ పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు మందాడి వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు మార్పుడి జనార్ధన్, చెరుకూరి బోసు, చెరుకూరి సుబ్బారావు, నల్లగట్ల సుబ్బారావు మందాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తాళాల రచ్చ

- మంగళవారం బాగాలేదు
- గురువారానికి వాయిదా వేసిన జిల్లా పంచాయతీ అధికారి

ప్రజాశక్తి-శింగరాయకొండ
శింగరాయకొండ గ్రామపంచాయతీలో తాళాల రచ్చకు ముగింపు పడలేదు. తాళాల రచ్చకు పరిష్కరించేందుకు జిల్లా పంచాయతీ అధికారులు మంగళవారం వచ్చారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. జూనియర్ అసిస్టెంట్ గత కొంతకాలంగా విధులకు హాజరు కావడం లేదు. జూనియర్ అసిస్టెంట్ గదిలో పంచాయతీకి సంబంధించిన పలు దస్త్రాలు ఉన్నాయి. జూనియర్ అసిస్టెంట్ తన గది తాళం , రికార్డులు ఎవరికీ అప్పగించలేదు. ఈ క్రమంలో గది తాళాలు పగులగొట్టి రికార్డులు స్వాధీనం చేసేందుకు పంచాయతీ సెక్రెటరీ రామ కోటయ్య మండల, జిల్లా అధికారులను ఆశ్రయించారు. తాళాలు పగలగొట్టి రికార్డులు స్వాధీనం చేసుకోవాలని జిల్లా అధికారులు ఆయన సూచించారు. పగలగొట్టే సమయంలో సర్పంచి ఆ గదికి మరో తాళం వేశారు. దీంతో గత కొన్ని రోజులుగా తాళాల రచ్చ కొనసాగుతోంది. ఈ విషయమై ప్రజాశక్తి దిన పత్రికలో పంచాయతీలో తాళాల రచ్చ అనే కథనం సోమవారం ప్రచురితమైంది. దీనికి తోడు గ్రామపంచాయతీలో అవినీతిపై విచారణ జరపాలని జనసేన మండల అధ్యక్షుడు అయినాబత్తిన రాజేష్ జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. దీంతో సెలవుపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శి రామకోటయ్యకు సెలవు రద్దు చేసి వెనక్కి పిలిచారు. జూనియర్ అసిస్టెంట్‌ను మంగళవారం కార్యాలయానికి రావాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి సమస్యలను పరిష్కరించేందుకు కార్యాలయానికి వచ్చారు. జూనియర్ అసిస్టెంట్ గదికి తాళం మీద తాళం మీద తాళం వేసి చూశారు. ఇలా ఎందుకు జరిగిందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అవినీతిపై ఫిర్యాదు నేపథ్యంలో రికార్డులను పరిశీలించేందుకు ప్రయత్నం చేశారు. అయితే రికార్డులు అన్ని జూనియర్ అసిస్టెంట్ గదిలో ఉన్నాయని సిబ్బంది తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ కూడా రాలేదు. దీంతో తంగమంతా పరిశీలించిన జిల్లా పంచాయతీ అధికారులు ఈ రోజు మంగళవారం కదా ఎందుకులే .. గురువారం వస్తాను జూనియర్ అసిస్టెంట్ గదికి వేసి తాళాలు పగులగొట్టి రికార్డులు స్వాధీనం చేసుకుందామని చెప్పారు. రికార్డులు పరిశీలిస్తే తప్ప అక్కడ ఏం జరుగుతుందో తెలియదని, గురువారం రికార్డులు పరిశీలించి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులు అందుబాటులో లేని కారణంగా విచారణను గురువారానికి వాయిదా వేశామని, రికార్డులు పరిశీలించిన తర్వాత తగు చర్యలు తీసుకుంటామని ఆమె విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ పద్మ, ఎంపిడిఒ నగేష్ కుమారి, ఇఒఆర్‌డి సుధాకర్, పంచాయతీరాజ్ జెఇ కోటా శ్రీహరి, కార్యదర్శి రామకోటయ్య పాల్గొన్నారు.


విచారణ కోసం వచ్చిన జిల్లా పంచాయతీ అధికారులు


చెక్కు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

వికలాంగుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పొదిలి : పొదిలికి చెందిన శివరామయ్యకు విద్యుత్ షాక్ కారణంగా రెండు చేతులు దెబ్బతిన్నాయి. అందులో భాగంగా బాధితుడికి నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి చేతుల మీదుగా రూ.5 వేల ఆర్థిక సాయాన్ని దాతల సహకారంతో అందజేశారు. స్థానిక దివ్యాంగ రక్షక్ ఫౌండేషన్ కార్యాలయంలో సిరిగిరి రామకృష్ణా రక్షక ఫౌండర్ దాత బివి. నరసింహారావు నగర పంచాయతీ కమిషనర్ ఎల్.చంద్రశేఖర్ రెడ్డి చేతుల మీదుగా రూ.5,000 చెక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మస్తాన్‌షా, శ్రీను, రాధా, ఆంజనేయులు, నరసింహారావు, బ్రహ్మారెడ్డి, ధనలక్ష్మి, అమ్ములు, రాజేష్ పాల్గొన్నారు.

పాఠశాలలో నీటి కష్టాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం: యర్రగొండపాలెం-మాచర్ల రోడ్డులోని ఏపీ గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాల్లో 270 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. స్నానాలకు, మరుగుదొడ్లకు, తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఇక్కడ నాలుగు బోర్లు వేస్తే కేవలం ఒక్క బోరు మాత్రమే పని చేస్తోంది. ఆ బోరులో సైతం అరకొరగానే నీరు వస్తోంది. గతంలో ఇక్కడ రూ.9 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు నిరుపయోగంగా మారింది. గత రెండేళ్ల నుంచి మిల్లంపల్లి పంచాయతీ ఆధ్వర్యంలో రోజుకు నాలుగు ట్యాంకర్ల నీరు సరఫరా చేస్తున్నారు. ఆ నీరు కూడా సరిపోవడం లేదు. విద్యార్థులకు రోజూ స్నానం చేయడం కష్టంగా మారింది. ఇప్పటికైనా అధికారులు మేలుకొని తమ నీటి కష్టాలు తీర్చాలని గిరిజన విద్యార్థుల వేడుకొంటున్నారు.

15 నుంచి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో స్టాఫ్ సెలక్షన్ కమీషన్ మరియు ఇతర పోటీ పరీక్షలకు ఈ నెల 15 నుంచి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీధర్‌నాయుడు తెలిపారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులతో పాటు పూర్వ విద్యార్థులకు కూడా జవహర్ నాలెడ్జ్ సెంటర్ ద్వారా జెకెసి కో ఆర్డినేటర్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ పి.ప్రదీప్ ఆధ్వర్యంలో ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి 9:40గంటల వరకు లెక్చర్‌లో అధ్యాపకుడు ఆర్.గోపి శిక్షణ ఇస్తారని తెలిపారు. సాయంత్రం 3:00 గంటల నుంచి 3:45 గంటల వరకూ జివిస్‌లో అధ్యాపకులు కె.శ్రీనివాసరావు, కెవిఎస్.శ్రీనివాస్, పి.రామకోటయ్య, డాక్టర్ తిరుపతయ్య, డాక్టర్ జి.పుష్పరాజ్ శిక్షణ ఇస్తారన్నారు. సాయంత్రం 3:45 గంటల నుంచి 4:30 గంటల వరకు ఆంగ్లంలో అధ్యాపకుడు డాక్టర్ పి.ప్రదీప్, సాయంత్రం 4:30 గంటల నుండి 5 గంటల వరకూ కంప్యూటర్‌లో అధ్యాపకుడు వి.వెంకటేశ్వర్‌రెడ్డి శిక్షణ ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-దర్శి : దర్శి మండలం రాజంపల్లి గ్రామానికి గొర్ల ప్రసాద్, మాలిక దంపతులు కుమారుడు షర్వాన్ అద్విత్‌రామ్ మొదటి పుట్టినరోజు సందర్భంగా స్థానిక శ్రీ శిరిడి సాయిబాబా వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, మిఠాయిలు మంగళవారం పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పత్తిపాటి వెంకట్రావు, వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి-పొన్నలూరు
పొన్నలూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి కె. మాధవ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఈ సమావేశంలో భోగనంపాడు ఎంపిటిసి రామాంజనేయులు మాట్లాడుతూ ఇంటి నిర్మాణం చేపట్టని వారికి సిమెంట్ ఎలా ఇస్తారని హౌసింగ్ ఎఇను ప్రశ్నించారు. ఇంటి నిర్మాణం చేపట్టని వారి నుంచి డబ్బులు రికవరీ చేస్తామని ఎఇ తెలిపారు. సర్పంచి చిన్నమస్తాన్ మాట్లాడుతూ కనిగిరి నుంచి మాలకొండ దేవస్థానానికి ప్రతి శనివారమూ బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్‌టిసి అధికారులను కోరారు. సమావేశంలో ఎంపిడిఒ కల్పన, ఎంపిపి కె. మాధవ, జెడ్‌పిటిసి బి. వెంకటేశ్వర్లు తహశీల్దారు సుధాకర్, ఎంపిటిసిలు, సర్పంచులు,తదితరులు పాల్గొన్నారు.

దొంగలకు దేహశుద్ధి

ప్రజాశక్తి-కొమరోలు : మండల పరిధిలోని గోనెపల్లి గ్రామ సమీపంలోని పోలేరమ్మ గుడిలో సోమవారం రాత్రి ఇద్దరు దొంగలు చోరీ యత్నించారు. గ్రామస్తులు దొంగలను పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. పోలీసులు దొంగలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. గతంలోనూ ఇదే దేవాలయంలో నాలుగు సార్లు చోరీ జరగడంతో గ్రామస్తులు సిసి కెమెరాలు ఏర్పాటు చేరారు.

చెక్‌పోస్టు ఏర్పాటు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం
యర్రగొండపాలెం మండలం గంజివారిపల్లి పంచాయతీ పరిధిలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీదద్దనాల ఆంజనేయస్వామి ఆలయం, దద్దనాల చెంచుగూడెం వెళ్ళు భక్తులకు కోసం శాంతినగర్ వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్టు టైగర్ విఘ్నేష్ అప్పావ్ ఆధ్వర్యంలో ఈ చెక్‌పోస్టు చేశారు. శనివారం, మంగళవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే భక్తులను, ప్రయాణీకులను అనుమతిస్తామని గంజివారిపల్లి అటవీక్షేత్ర అధికారి సుబ్బారావు తెలిపారు. పర్యావరణ మెయింటెనెన్స్ నిమిత్తం టూ విల్లర్ వారి వద్ద రూ.50, త్రి, ఫోర్ విల్లర్ వారి వద్ద రూ.100 వసూలు చేయనున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల
మండల పరిధిలోని పెద్ద బొమ్మలపురం గ్రామంలో చింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.యాగ్నిక్ ఆధ్వర్యంలో స్టాప్ డయేరియా మరియు డెంగీ మాసోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రజలు వాతావరణంలో వచ్చే మార్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డయేరియా సోకకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిలువ ఉన్న ఆహార పదార్థాలను తినరాదన్నారు. చేతులు పరిశుభ్రంగా కడుకోవాలని సూచించారు. మలేరియా సూపర్ వైసర్ కె.ఇజ్రాయేలు మాట్లాడుతూ దోమ కాటు వల్ల 5 రకాల వ్యాధులు వస్తాయని తెలిపారు. దోమ కాటుకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ సూపర్‌వైజర్లు, పిహెచ్ఎన్ పి. సూర్యకుమారి, సబ్‌యూనిట్ ఆఫీసర్ సిహెచ్ .రమేష్‌బాబు, సూపర్ వైజర్లు కె. సత్యనారాయణరెడ్డి, కె.పద్మావతి, ఎఎన్ఎం భాను, సిహెచ్ఒ మీరావలి, హెల్త్ అసిస్టెంట్ భరత్‌భూషణ్, 104 సిబ్బంది, చాంద్ బాషా, ఆశా కార్యకర్తలు ఎ.కాశీ, ఈశ్వరి, ఎం.లక్ష్మీదేవి, డి.కాశమ్మ, ఎం.పవిత్ర, హుసేన్‌బీ పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

దర్శి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాళ్లూరు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ షేక్ ఖాదర్‌మస్తాన్‌బి తెలిపారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ తాళ్ళూరులో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మస్తాన్‌బి మాట్లాడుతూ వర్షాలు పడి దోమల ఉధృతి పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో సీజన్ వ్యాధులు ప్రబల అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పంచాయతీల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచులు సహకరించాలన్నారు. తొలుత కుష్టు వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పారా మెడికల్ అధికారి ఎన్‌వి. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేష్ యాదవ్, సూపర్‌వైజర్లు రవికుమార్, కోటేశ్వరి, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం
యర్రగొండపాలెం నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవులను టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు కోరారు. అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవులను గూడూరి ఎరిక్షన్‌బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత 5 ఏళ్ళ వైసిపి పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రితో ఎరిక్షన్‌బాబు

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

రెవెన్యూ డివిజనల్ అధికారి బిఎస్ హేలా షారోన్

ప్రజాశక్తి-రేపల్లె

గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ (లింగ ఎంపిక నిషేధ) చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణ చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ డివిజన్ అధికారి బిఎస్ హేలా షారోన్ హెచ్చరించారు. ఆర్డీవో కార్యాలయంలో గర్భస్థ పూర్వ, పిండ లింగ నిర్ధారణ చట్టంపై మంగళవారం డివిజన్ స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఆడ పిల్లల నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి.. అక్కడ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం అనే నినాదంతో అవగాహన కల్పించాలన్నారు. గర్భంలో బిడ్డ ఆరోగ్యంగా ఉన్నాడా లేదా, ఏమైనా అంగవైకల్యంతో ఉందా అని మాత్రమే స్కానింగ్ ద్వారా చెక్ చేయాలని సూచించారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ మెషీన్లు, రిజిస్ట్రేషన్ గడువు తేదీకి నెల ముందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని,


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ హేలా షారోన్

అనంతరం జిల్లా కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ గడువు పూర్తయిన యజమాన్యాలపైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డయాగ్నోస్టిక్, ఇమేజింగ్, ఫెర్టిలిటీ సెంటర్లు, స్కానింగ్ మెషీన్ల ద్వారా లింగ నిర్ధారణకు సంబంధించి ఎలాంటి స్కానింగ్ చేయబోమని ఆసుపత్రిలో బోర్డులను ఏర్పాటు చేయాలని ఆర్డీవో ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారిపై చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. క్లినిక్కు, హస్పిటల్స్ స్కానింగ్ యంత్రాలను కొనుగోలు చేసే ముందుగానే జిల్లా అప్రాప్రియేట్ అథారిటీ దగ్గర ఎన్సీసీ తీసుకోవాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులలో స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. అర్హులైన వైద్యుని సలహా మేరకు మాత్రమే గర్భవతులు స్కానింగ్ తీయించుకోవాలని తెలియజేశారు. లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని, చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడితే శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రోహిణి రత్నశ్రీ, శర్మ, సీఐ నజీర్ బేగ్, డాక్టర్ వీర రాఘవయ్య, ప్రభాకర్, సక్సేనా, డాక్టర్ సుధాకర్, డాక్టర్ చైతన్య తేజ, డాక్టర్ రమేష్, డాక్టర్ జాన్ ప్రసాద్ రెబ్బా, మరియమ్మ అరుణ పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు పోలీస్ స్టేషన్లో కౌన్సెలింగ్

ప్రజాశక్తి-పంగులూరు

రౌడీ షీటర్లు అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రేణింగవరం ఎస్ఐ కేకే తిరుపతిరావు హెచ్చరించారు. మంగళవారం పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు స్థానిక పోలీస్ స్టేషన్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే ఎలాంటి సంఘటనలకు పాల్పడినా, కబ్జాలు, చట్ట వ్యతిరేకమైన పనులకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రజలు శాంతియుతంగా జీవించేందుకు సహకరించాలని కోరారు.


మాజీ జెడ్పిటిసి కరి వెంకట సుబ్బారావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు

కెవిని పరామర్శించిన డాక్టర్ దగ్గుబాటి

ప్రజాశక్తి-పంగులూరు

మాజీ జెడ్పిటిసి కరి వెంకట సుబ్బారావును మాజీ మంత్రి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు పరామర్శించారు. మంగళవారం మండలంలోని చందలూరు గ్రామంలో గల వెంకట సుబ్బారావు నివాసానికి వెళ్లి, ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కరి వెంకట సుబ్బారావు ఇటీవల అనారోగ్యంతో ఒంగోలులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. అక్కడ చికిత్స పొంది చందలూరులోని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. సుబ్బారావును పరామర్శించిన దగ్గుబాటి ఆయన కుటుంబ సభ్యులను అందరినీ పేరుపేరునా పలకరించారు. అనంతరం ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలు, ఓటింగ్ సరళి, రాజకీయ పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు. స్థానిక నాయకులతో కూడా మాట్లాడారు. ఆహార నియమాలు పాటించి, ఆరోగ్యం కుదుటపడే వరకు జాగ్రత్తలు తీసుకోవాలని వెంకట సుబ్బారావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కందిమల్ల రామాంజనేయులు, పెంట్యాల రామలింగస్వామి, అడ్డగడ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కెఆర్‌కె డిగ్రీ కళాశాలలో నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి-అద్దంకి

సింగరకొండ కెఆర్‌కె డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్ర, రసాయన శాస్త్ర, మరియు వాణిజ్య శాస్త్ర విభాగాల విద్యార్థులకు ప్రధాన విద్యతో పాటుగా జీవన సాఫల్య నైపుణ్యాలను అలవర్చుకునే నేపథ్యంలో శాప్ మరియు షాంపోలను సేంద్రియ రీతులలో, తక్కువ ఖర్చుతో తయారు చేయు పద్ధతులపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ వి మోహన్‌రావు అధ్యక్షత వహించగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతకు ఉపయోగించే షాంపూ మరియు షాంపూల రసాయన సంఘటనం తయారు చేసే పద్ధతులపై కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ పివి హేమలత పిపిటి ద్వారా శిక్షణా తరగతుల నిర్వహించారు. తదుపరి కామర్స్ విభాగాధిపతి ఏ శిఖామణి వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పించారు. చివరిగా వృక్ష శాస్త్ర ఉపన్యాసకులు డి రాజశేఖర్ విద్యార్థులకు షాంపూ మరియు షాంపూల తయారీని ప్రయోగాత్మకంగా నిర్వహించి వాటి తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమ నిర్వహణలో రసాయన శాస్త్ర విభాగాధిపతి వి రామకృష్ణ మరియు వృక్షశాస్త్ర ఉపన్యాసకులు డాక్టర్ మస్తాన్‌వలి సహాయ సహకారాలు అందించారు.

బాలికా సదనంలో ప్రవేశాలకు ఆహ్వానం

ప్రజాశక్తి-బాపట్ల

మహిళా అభివద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికా సదనంలోఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు చదివే బాలికలకు ప్రవేశాలు జరుగుతున్నట్లు బాలిక సదనం పర్యవేక్షకురాలు ఎస్ సుబ్బలక్ష్మి మంగళవారం తెలిపారు. బాపట్ల ఫైర్ స్టేషన్ పక్కన ఉప్పరపాలెం రోడ్‌లో ఉన్న బాలిక సదనంలో మొత్తం 30 సీట్లు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అన్ని సామాజిక వర్గాల విద్యార్థులు ప్రవేశానికి అర్హులన్నారు. 6 యేళ్ల వయసు నుంచి 12 యేళ్ల వయసు గల బాలికలు బాల సదనంలో ప్రవేశాలకు అర్హులని తెలిపారు. అనాథలు, పాక్షిక అనాథలు, ఆర్థికంగా వెనుకబడిన బాలికలు అర్హులని తెలిపారు. ఈ వసతి గృహంలో ఉచిత భోజనం సౌకర్యం, ఆటస్థలం సదుపాయాలున్నాయని అన్నారు.

ప్రజా సమస్యలపై అర్జీలు ఇవ్వండి: వేగేశన

ప్రజాశక్తి-బాపట్ల


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని బాపట్ల శాసనసభ్యులు నరేంద్రవర్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నరేంద్ర వర్మను కలిసేందుకు వచ్చిన ప్రజల నుంచి ప్రజా సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ గత ఐదేళ్లు ఎలాంటి భరోసా లభించక సామాన్యులు అనేక కష్టాలు ఎదుర్కొన్నారని అన్నారు. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక సతమతమయ్యారని తెలిపారు. అలాంటివారు బాపట్ల శాసనసభ్యులు నరేంద్రవర్మ క్యాంప్ కార్యాలయం, టిడిపి ఆఫీసులో నియోజకవర్గ ప్రజలు నేరుగా కలిసి తమ సమస్యలను అర్జీల ద్వారా విన్నవించుకోవచ్చని అన్నారు. అర్హులైన వృద్ధులు, వికలాంగులు, మహిళలకు పెన్షన్ సదుపాయంతోపాటు, ఉద్యోగాల కోసం యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం వివిధ విభాగాల ఉద్యోగాలు, విద్య, వైద్య సాయం కోసం సామాన్యుల నుంచి నరేంద్ర వర్మ అర్జీలను స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నరేంద్రవర్మ హామీ ఇచ్చారు.

నేడు కార్మిక డిమాండ్స్ డే

ప్రజాశక్తి-భట్టిప్రోలు


మాట్లాడుతున్న రమాదేవి

ఈ నెల 10వ తేదీన జరిగే కార్మిక డిమాండ్స్‌డేను జయప్రదం చేయాలని సిఐటియు మండల అధ్యక్షులు బి రమాదేవి అన్నారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం సిఐటియు మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ గతంలో రూపొందించిన కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌ను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడుతోందని, అదే జరిగితే కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. ప్రజా సమస్యలపై ధర్నాలు, ఆందోళనలు, ఉద్యమాలు చేయటానికి అవకాశం లేకుండా నిర్బంధానికి గురయ్యే పరిస్థితులు ఉన్నాయని, వీటిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. కార్మిక హక్కులు సాధించటానికి గాను ఈ డిమాండ్స్‌డేను జయప్రదం చేయాలని కోరారు. అలాగే అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, మెప్మా, వెలుగు, హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష, ఉపాధి హామీ, మున్సిపాలిటీ సేంద్రియ వ్యవసాయం, 104, 108, ఆయుష్ తదితర అన్ని రకాల పథకాల కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని ఆమె డిమాండ్ చేశారు. కనీస వేతనం కింద రూ.26,000 అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మురుగుడు సత్యనారాయణ, పి మనోజ్ కుమార్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రేపల్లె: ఉచిత వైద్య శిబిరాన్ని రేపల్లె ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీ సత్య సాయి సేవ సమితి నిర్వాహకులు తెలిపారు. శ్రీ సత్య సాయి సేవ సమితి మరియు కేర్ యోగ న్యాచురోపతి, ఆయుర్వేద, హోమియోపతి హాస్పటల్ పిట్టలవానిపాలెం వారి ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఒంటిగంట వరకు రేపల్లె పట్టణంలోని శ్రీ సత్యసాయి మందిరంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉచిత ఇసుక పాలసీతో

ఊపందుకోనున్న నిర్మాణ రంగం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చీరాల


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

తమ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీతో రాష్ట్రంలో నిర్మాణ రంగం ఊపందుకుంటుందని, ఇది రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. ఉచిత ఇసుక అందుబాటులోకి రావడంతో పేదల సొంతింటి కలనెరవేరుతుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నెలరోజులలోపే అమలులోకి తెచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక పాలసీ పక్కాగా అమలు చేస్తూ జీవో నెంబర్ 43 అమలు చేయడంతో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందన్నారు. నాణ్యమైన ఇసుక ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నది తెలుగుదేశం విధానమని, పారదర్శకత, ముందుచూపుతో ఈ పాలసీ రూపొందించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఈ నిర్ణయంతో సామాన్యులకు భారీ ఊరట లభించిందని, దీంతో తమ ప్రభుత్వాన్ని అన్ని వర్గాల ప్రజలు అభినందిస్తున్నారని పేర్కొన్నారు. ఎందుకంటే గత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇసుక మాఫియా నడిపి కోట్లు కొల్లగొట్టిందని, వైసీపీ నేతలే ఇసుకాసుర అవతారం ఎత్తి రూ.50 వేల కోట్లకు పైగా కొల్లగొట్టారని విమర్శించారు. జగన్ ప్రభుత్వం ఇసుక కృత్రిమ కొరత సృష్టించి ప్రజలను ఇబ్బందులకు గురి చేసిందని, ఫలితంగా నిర్మాణరంగం కుదేలైందని మండిపడ్డారు. జగన్ పాలనలో పేదలు ఇల్లు కట్టుకోడానికి రూ.5 లక్షలు ఖర్చు చేస్తే అందులో ఇసుక కొనడానికే రూ.3 లక్షలు ఖర్చు పెట్టాల్సిన దుస్థితి ఉండేదని గుర్తు చేశారు. గృహ నిర్మాణ శాఖకు సరఫరాల పేరుతో 98 లక్షల టన్నుల ఇసుకను జగన్ అండ్ కో మింగేసిందని ధ్వజమెత్తారు. జగన్ బినామీ సంస్థ జేపీ వెంచర్స్ చెల్లించాల్సిన మొత్తం నుంచి రూ.800 కోట్లు మినహాయించి ప్రజాధనాన్ని ధారాదత్తం చేశారని విమర్శించారు. గత ఐదేళ్లలో వైసీపీ నేతలు మింగేసిన ఇసుకతో సుమారు పది లక్షలకు పైగా ఇళ్లు కట్టొచ్చంటే వారు ఏ స్థాయిలో అవినీతి చేశారో అర్థం చేసుకోవచ్చని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య వ్యాఖ్యానించారు. జిల్లా స్థాయిలో శాండ్ కమిటీలు ఏర్పాటు చేసి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలు, మైనింగ్ అధికారులు ఎక్కడికక్కడ పర్యవేక్షిస్తారని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య వివరించారు.

లెట్స్ హెల్ప్ ఆధ్వర్యంలో ట్రై సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి-చీరాల


వికలాంగులకు ట్రై సైకిల్ పంపిణీ చేస్తున్న లెట్స్ హెల్ప్ ప్రతినిధులు

పట్టణంలోని చర్చి రోడ్లో లెట్స్ హెల్ప్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పేద వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ ప్రతినిధి కనపర్తి కిరణ్ కుమార్ చేతుల మీదగా ట్రై సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీరాల పట్టణం కూరగాయల మార్కెట్ సమీపంలో నివాసం ఉంటున్న ఇద్దరు పేద వికలాంగులు ట్రై సైకిళ్లు లేక కొన్నాళ్లుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయితే వారు పడుతున్న ఇబ్బందులు లెట్స్ హెల్ప్ ఆర్గనైజేషన్ అధినేత రామిశెట్టి దిలీప్, అనూష దంపతుల దృష్టికి తీసుకురాగా వారు వెంటనే స్పందించి రెండు ట్రై సైకిళ్లను అందజేసినట్లు తెలిపారు. లెట్స్ హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో చీరాలలో గత కొంతకాలంగా విద్యార్థులు, వికలాంగులు, వృద్ధులు, నిరుద్యోగులకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో డేవిడ్, సాంబయ్య, దయాకర్, శివ, వసంతరావు, గ్రేస్, రాజు, రాజేష్, గోపి, సుభాని, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'మినరల్' పేరుతో దోపిడీ

- అనుమతి లేకుండా వాటర్‌ప్లాంట్ల ఏర్పాటు
- నాణ్యాతా ప్రమాణాలకు తిలోదకాలు
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- చోద్యం చూస్తున్న అధికారులు



ప్రజాశక్తి-తర్లుపాడు

మినరల్ వాటర్ పేరుతో వాటర్ ప్లాంట్ల యజమానులు ప్రజలను దోపిడీ చేస్తున్నారు. అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా వాటర్ ప్లాంట్లు నిర్వహిస్తూ తమ జేబులు నింపుకుంటున్నారు. 20 లీటర్ల నీటిని రూ.10 విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాలను ఉల్లంఘిస్తూ ఇష్టారాజ్యంగా నీటి వ్యాపారం చేస్తున్నారు. తర్లుపాడు గ్రామపంచాయతీ పరిధిలో మూడు వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో అనుమతి లేకుండా వాటర్ పాంట్లు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. నాణ్యత ప్రమాణాలు లేని నీటిని కొనుగోలు చేసి తాగడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించని నిర్వాహకులు

ప్రజలకు తాగునీరు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. తాగునీరు సరఫరా చేసే వాటర్ ప్లాంట్లలో ఎంత శాతం మినరల్స్ వాడుతున్నారో? ప్రజలకు ఏ విధమైన భద్రత కల్పిస్తున్నారో? అన్న విషయాన్ని అధికార యంత్రాంగం పరిశీలించాల్సి ఉంది. ఇలాంటి పరిశీలనలు జరిగిన దాఖలాలు లేవు. కొందరు బోరులోని నీటినే వాటర్ ప్లాంట్ల ద్వారా విక్రయిస్తున్నారు. ఆ నీటిలో ఎలాంటి మినరల్స్ ఉండటం లేదు. ఆ నీరు తాగడంతో ప్రజలు రోగాల బారీన పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మినరల్ వాటర్ పేరుతో జనరల్ వాటర్ విక్రయిస్తున్న వాటర్ ప్లాంట్ల యాజనులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అదే విధంగా అనుమతులు లేని వాటర్ ప్లాంట్ల నిర్వహకులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

అనుమతులు లేని ప్లాంట్లపై చర్యలు : ఎంపిడిఒ

అనుమతులు లేని వాటర్ ప్లాంట్‌లపై చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ బి.చంద్రశేఖర్ తెలిపారు. వాటర్ ప్లాంట్ నిర్వాహకులు ఆహార భద్రత అధికారుల నుంచి, ఐఎస్ఐ సంస్థ నుంచి అనుమతులు పొంది ఉండాలన్నారు. అనుమతి పొందిన పత్రాలను పంచాయతీ అధికారులకు అందజేయాలన్నారు. అనంతరం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. తర్లుపాడులో ఒక్క వాటర్ ప్లాంట్‌కు మాత్రమే అనుమతి ఉన్నట్లు తెలిపారు. ఇతర వాటర్ ప్లాంట్లు తమ వద్ద నుంచి ఎలాంటి అనుమతులు పొందలేదన్నారు. అనుమతులు పొందకుండా అక్రమంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లపై ఆహార భద్రత అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



పోతుల రామారావును సన్మానిస్తున్న మంత్రి రవీంద్ర

మంత్రి రవీంద్రను కలిసిన పోతుల

ప్రజాశక్తి-టంగుటూరు

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావును శాలువతో సన్మానించారు. పోతుల రామారావు వెంట రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పోతుల రాజేంద్రప్రసాద్, చదలవాడ వేణు ఉన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

ఎమ్మెల్యే శ్రీధర్ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

కడప జిల్లా రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను దోర్నాలలో టిడిపి నాయకులు సన్మానించారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలోనికి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రిగా, పవన్‌కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా దోర్నాల నుంచి శ్రీశైలానికి ఎమ్మెల్యే పాదయాత్ర చేపట్టారు. తొలుత శ్రీధర్ దోర్నాలలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీశైలానికి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ మురళీ, నాయకులు ప్రసాద్, దాసయ్య, పండు, రామాంజనేయులు, టిడిపి నాయకులు బట్టు సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సుబ్బరత్నం, గోపాల్, చంటి, రామిరెడ్డి, చెన్నారెడ్డి, శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

మస్తాన్‌కు మాజీ మంత్రి సురేష్ నివాళి

ప్రజాశక్తి-కొండపి

కొండపి అంబేద్కర్ కాలనీలో యనమద్దిని మస్తాన్ దశదిన కర్మ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి , వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదిమూలపు సురేష్ పాల్గొని మస్తాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంభసభ్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు ఆరికట్ల కోటిలింగయ్య, నాయకులు బొక్కిసం సుబ్బారావు, జి.మురళి, ఆరికట్ల హరినారాయణ, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణాలతో కూడిన విద్యనందించాలి

ఆర్‌జెడి లింగేశ్వరరెడ్డి




మాట్లాడుతున్న ఆర్‌జెడి లింగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి -కనిగిరి

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యనందించాలని గుంటూరు జోన్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి.లింగేశ్వర రెడ్డి తెలిపారు. కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న టీచ్ టూల్ పర్యవేక్షకుల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. పది రోజుల శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధన ద్వారా అందించాలని సూచించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు సమగ్ర బోధనా విధానాలను ఉపాధ్యాయులు ఆచరించాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో టీచ్ టూల్ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చి తరగతి గదుల్లో అమలు చేయనున్నట్లు తెలిపారు. బడిబయట ఉన్న పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించడం ఉపాధ్యాయులు బాధ్యతగా తీసుకోవాలన్నారు. విద్యాప్రదేశ్ కార్యక్రమాలను పాఠశాలల్లో కచ్చితంగా అమలు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలులో ఉపాధ్యాయులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌జెడి వెంట ఎంఇఒలు రాజుల కొండారెడ్డి, జి.సంజీవి, యువి.నారాయణరెడ్డి ఉన్నారు.

మోడల్ స్కూల్‌లో తనిఖీ

కనిగిరి మోడల్ స్కూల్‌ను ఆర్‌జెడి లింగేశ్వర్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న బోధన, అటల్ టింకరింగ్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఆర్‌జెడి వెంట ప్రిన్సిపల్ రమణయ్య , ఎంఇఒలు రాజాల కొండారెడ్డి, యువి. నారాయణ రెడ్డి, డి.రామిరెడ్డి ఉన్నారు.



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మెల్సీ హరిప్రసాద్‌కు సన్మానం

ప్రజాశక్తి-త్రిపురాంకతం

జనసేన యర్రగొండపాలెం నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ పాకనాటి గౌతమ్‌రాజు ఆధ్వర్యంలో మంగళగిరిలోని జనసేనా పార్టీ కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వ్యక్తి గత సహాయకులు ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను పాతఅన్నసముద్రం సర్పంచి పాతకోటి వెంకటసుబ్బారావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొసన ప్రసాద్, భిమిశెట్టి సత్యం తదితరులు పాల్గొన్నారు.

'శ్రీరామ్ మల్టీ సూపర్‌స్పెషాలిటీ' లో నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలులోని శ్రీరామ్ మల్టీసూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో బుధవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ అధినేత డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ చాపల శాంతకుమారి తెలిపారు. ఈ వైద్యశిబిరంలో రక్తదానం చేసిన వారికి శ్రీరామ్ ఆరోగ్యరక్ష హెల్త్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్డు పొందిన వారికి ఏడాది పాటు ఒపి ఉచితమని తెలిపారు. అదేవిధంగా వివిధ పరీక్షల్లో రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. రక్తదాన శిబిరంలో మిత్రులు, ఆత్మీ యులు, శ్రేయోభిలాషులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. రక్తదానం చేయదలచిన వారు చిరంజీవి 98494 12052 సెల్ నంబరులో సంప్రదించి తమ పేర్లు నమోదు చేయించు కోవాలన్నారు. అత్యవసర వైద్య సేవలకు 24/7 హెల్ప్ లైన్ నంబర్ 8184 82 82 82ను సంప్రదించాలన్నారు.

మంత్రి స్వామిని కలిసిన గూడూరి



మంత్రి స్వామితో మాట్లాడుతున్న గూడూరి ఎరిక్షన్‌బాబు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అమరావతి సచివాలయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామిని టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, ఉమ్మడి ప్రకాశం జిల్లా టిడిపి ఎమ్మెల్యేలు, నేతలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామికి యర్రగొండపాలెం నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ వసతి గహాలు, గిరిజన వసతి గహలకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాట్లు, అదనపు భవన నిర్మాణాలు, విద్యార్థుల అడ్మిషన్ సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రికి ఎరిక్షన్‌బాబు విన్నవించారు. యర్రగొండపాలెం పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర మరియు బాలికల వసతి గహాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై తక్షణమే సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అందుకు మంత్రి స్వామి సానుకూలంగా స్పందించినట్లు ఎరిక్షన్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా టిడిపి ఎమ్మెల్యేలు, నేతలు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విద్యార్థులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సార్డ్స్ సంస్థ సహకారంతో ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ దేవర యాదిత్య ఆధ్వర్యంలో మంగళవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 320 మందికి రక్త పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్షలు నిర్వహించారు. దంతాలపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కారక్రమంలో దంత వైద్యులు డాక్టర్ వి.శ్యామల, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్, ఎంఇఒ బి.ఆంజనేయులు, వైస్‌ప్రిన్సిపల్ దయాకర్, సార్డ్స్ సంస్థ ఎపిఎం మందా మరియబాబు, సిబ్బంది అంకయ్య, గురవయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం శాఖాగ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మీ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రంథాలయ పాఠకులతో మాట్లాడారు. అందుబాటులో ఏఏ పుస్తకాలున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించిన అన్ని రకాల కాంపిటేటివ్ పుస్తకాలను అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. గ్రంథాలయానికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు కటికల ఝాన్సీ పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-టంగుటూరు

లేబర్ వెల్ఫేర్ డే సందర్భంగా పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బదికి ఉచిత కంటి, షుగర్, గుండె పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. చైతన్య కార్డియాక్ సెంటర్ వైద్యులు డాక్టర్ యన్.శివకృష్ణ, ఎమ్‌డి.డిఎం. కార్డియాలజిస్టు, స్మార్ట్ విజన్ వైద్యులు డాక్టర్ నాగమాధూరి ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 100 నాన్ టీచింగ్ సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ నాన్ టీచింగ్ సిబ్బంది కోసం ప్రతి సంవత్సరం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జివికె.మూర్తి, డీన్, స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఆర్.వీరాంజనేయులు, ఎఒ రమణబాబు, కళాశాల హెల్త్ కమిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ పి. బహ్మం పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో సమావేశం

ప్రజాశక్తి-టంగుటూరు

వాటర్ ప్లాంట్ ద్వారా సురక్షితమైన తాగు నీరు అందిస్తున్నట్లు టంగుటూరు సర్పంచి మద్దిరాల మమత తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఇంజినీరింగ్ సహాయకులకు డయేరియాపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ డయేరియా నిర్మూలనకు ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో 15 రోజులకు ఒకసారి క్లోరినేషను చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్ఒ మత్తయ్య, పంచాయతీ కార్యదర్శి నర్రా జగదీష్, టిడిపి నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, వైస్ సర్పంచి వెంకట్రావు, మక్కెన కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నల్లగుంట్ల గ్రామంలో

ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి కొమరోలు

ఎస్ఎఫ్ఐ గిద్దలూరు ఏరియా కమిటీ సమావేశం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ గిద్దలూరు ఏరియా కమిటీ అధ్యక్షుడు డి. తేజ మాట్లాడుతూ నల్లగుంట్ల గ్రామంలో బ్రిటిష్ కాలం నుంచి ఎయిడెడ్ ఉన్నత పాఠశాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం, మౌలిక సదుపాయాలు లేని కారణంగా పాఠశాల పరిస్థితి అధ్వానంగా తయారైనట్లు తెలిపారు. భవనాలు సైతం శిథిలావస్థకు చేరినట్లు తెలిపారు. పాఠశాలలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో పిల్లలు బడికి వెళ్లడం లేదన్నారు. కొంతమంది కొమరోలు, మరి కొంతమంది తాడిచెర్ల మోటు వెళ్లి చదువుకుంటున్నట్లు తెలిపారు. కొంత మంది ప్రైవేటు స్కూళ్లకు అధిక ఫీజులు చెల్లించి తమ పిల్లలను చదివించు కుంటున్నారన్నారు. నల్లగుంట్ల గ్రామంలో 500 కుటుంబాలు ఉన్నట్లు తెలిపారు. వారంతా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివించే స్థోమత ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. గ్రామస్తుల సౌకర్యార్థం ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అరుణ్ ,శశి, సుభాష్,శ్రీను,సాయి ,విష్ణు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ గిద్దలూరు ఏరియా కమిటీ అధ్యక్షుడు తేజ

జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన బొట్ల

ప్రజాశక్తి- టంగుటూరు

మాజీ ముఖ్యమంత్రి, వైసిపి రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహనరెడ్డిని తాడేపల్లి లోని ఆయన నివాస గృహంలో బీసీ విభాగంగా జోన్ –5 రాష్ట్ర ఇన్‌ఛార్జి బొట్ల రామారావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లాలో వైసిపి కార్యకర్తలు, నాయకుల పై తెలుగు దేశం నాయకులు, కార్యకర్తలు చేస్తున్న భౌతిక దాడులు గురించి, అక్రమ కేసులు బనాయించడం గురించి వివరించారు. అదేవిధంగా వైసిపి నాయకుల ఆస్తులను కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి పంచాయతీ రాజ్ శాఖ అధికారుల సహకారంతో జెసిబిలతో ధ్వసం చేస్తున్న విషయాన్ని జగన్ మోహనరెడ్డికి వివరించారు. దీంతో స్పందించిన జగన్ మోహన్ మాట్లాడుతూ టిడిపి నాయకులు అక్రమాలను దౌర్జన్యాలను ఎదుర్కొనేందుకు పార్టీ తరపున సీనియర్ న్యాయవాదులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మితిమీరి వ్యహరిస్తున్న అధికారులకు న్యాయస్థానాల ద్వారా గుణపాఠం చెబుదామని తెలిపినట్లు రామారావు తెలిపారు. టిడిపి నాయకులు విధ్వంసంలో ఆస్తులు నష్టపోయిన, మరణించిన, గాయపడినా కుటుంబాలను త్వరలో పరామర్శించనున్నట్లు జగన్‌మోహన్ రెడ్డి చెప్పినట్లు ఆయన తెలిపారు.



జగన్‌మోహన్‌రెడ్డితో బొట్ల రామారావు

విత్తన దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి- మార్కాపురం రూరల్

రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఉప వ్యవసాయ సంచాలకులు జి. లక్ష్మణ్ పేర్కొన్నారు. మార్కాపురం పట్టణంలోని పలు విత్తన దుకాణాల్లో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప వ్యవసాయ సంచాలకులు లక్ష్మణ్ కుమార్, తిరుపతి విజిలెన్స్ సిఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ సరైన పత్రాలు లేకుండా విక్రయిస్తున్న విత్తనాల అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు తెలిపారు. దుకాణాల తనిఖీల్లో మార్కాపురం ఒంగోలు టెక్నికల్ ఎఒ శ్రీనివాస నాయక్, మార్కాపురం తర్లుపాడు ఎఒలు దేవిరెడ్డి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



విత్తన దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు



వైద్యులను సన్మానిస్తున్న పౌండేషన్ సభ్యులు

వైద్యులకు సన్మానం

ప్రజాశక్తి - గిద్దలూరు రూరల్ : గిద్దలూరు మండలం క్రిష్ణంశెట్టిపల్లె ప్రభుత్వ వైద్యశాల వైద్యుడు డాక్టర్ పూనూరు శ్రీధర్ రెడ్డి , డాక్టర్ షేక్ జుబేద్‌ను ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ సభ్యులు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ నారాయణరెడ్డి, మాగులూరి శ్రీకాంత్ మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ మల్లికార్జున్ రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కందులను పరామర్శిస్తున్న మంత్రి నారాయణ

ఎమ్మెల్యే కందులకు మంత్రి నారాయణ పరామర్శ

ప్రజాశక్తి-మార్కాపురం : మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కాలికి హైదరాబాద్‌లోని యశోద హాస్పటల్‌లో శస్త్ర చికిత్స నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ మంగళవారం కందుల నారాయణరెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

పచ్చిగడ్డితో అధిక పాల దిగుబడి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

పచ్చిగడ్డితో పశువుల్లో పాల దిగుబడి పెరుగుతుందని పశుసంవర్దక శాఖ జెడిఎ డాక్టర్ బేబిరాణి తెలిపారు. మండల పరిధిలోని చదలవాడ గ్రామంలో పశుగ్రాస వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బేబిరాణి మాట్లాడుతూ మేలు జాతి రకాలైన సూపర్ నాసియర్ ,స్మార్ట్ సూపర్ నాసియర్ ,రెడ్ సూపర్ నాసియర్ ,భాగ్రజానాసియర్ పశుగ్రాసాల గురించి రైతులు వివరించారు. పశువులకు పచ్చిమేత అందించడం ద్వారా పాలఉత్పత్తి ఖర్చు కూడ తగ్గుతుందన్నారు. పశువులు కూడా ఆరోగ్యకరంగా ఉంటాయన్నారు. అనంతరం పశుగ్రాస క్షేత్రాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఉపసంచాలకులు బి.రవి, సహాయక సంచాలకులు నాగభూషణం, బసవ శంకరరావు, డాక్టర్ విజయకుమార్ రెడ్డి, డాక్టర్ భార్గవ్ ,డాక్టర్ రామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రాచర్ల ఎస్ఐగా ఇమ్మానియేల్

ప్రజాశక్తి - రాచర్ల

రాచర్ల ఇన్‌ఛార్జి ఎస్ఐగా పందిటి ఇమ్మానియేల్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్‌పి గరుడ సుమిత్ సునీల్ ఆదేశాల మేరకు మార్కాపురం డిఎస్‌పి ఎం.బాలసుందరరావు ఇమ్మానియేల్‌ను రాచర్ల ఎస్ఐ నియమించారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సుబ్రమణ్యం బదిలీపై తిరుపతి వెళ్లారు.

పొగాకు బేళ్ల అమ్మకం

,ప్రజాశక్తి-టంగుటూరు.

రైతులు నాణ్యమైన పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి తీసుకొస్తే అత్యధిక ధరలు పొందవచ్చునని టంగుటూరు పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. కారుమంచి, చింతలపాలెం, పంగులూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 729 పొగాకు బేళ్లను మంగళవారం అమ్మకానికి తెచ్చారు. అందులో 685 బేళ్ళు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 44 బేళ్ల ను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.365, అత్యల్ప ధర రూ.205, సరాసరి ధర కిలో 310–12 పైసలు పలికింది.

కొండపి : కొండపి పొగాకు వేలం కేంద్రానికి కామేపల్లి, పచ్చవ, గోగినేనివారిపాలెం, అక్కచెరువుపాలెం, పైడిపాడు గ్రామాలకు చెందిన రైతులు 747 పొగాకు సూర, ముక్క బేళ్లను మంగళవారం అమ్మకానికి తెచ్చారు.అందులో 654 బేళ్లుఅమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 93 బేళ్లను తిరస్కరించారు. కిలో అత్యధిక ధర రూ.152, అత్యల్ప ధర రూ.59, సరాసరి ధర కిలో రూ.91.52 పైసలు పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు.

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం పొదలకొండపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆ పాఠశాల ఉపాధ్యాయులు, యశ్వంత్ ఎడ్యుకేషన్ సొసైటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్య కాపీ రైటింగ్ పుస్తకాలు మంగళవారం పంపిణీ చేశారు. పిచ్చయ్య తన సొంత నిధులతో ప్రతి సంవత్సరం విద్యార్థులకు నోట్ బుక్స్ , కాపీ రైటింగ్ బుక్స్ పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. రామ సుబ్బారెడ్డి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అతిసార నుంచి పిల్లలను కాపాడుకోండి

పంగులూరు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శివ చెన్నయ్య

ప్రజాశక్తి-పంగులూరు

సీజనల్‌గా వచ్చే అతిసార వ్యాధి నుంచి ప్రజలు తమ పిల్లలను జాగ్రత్తగా కాపాడుకోవాలని పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శివ చెన్నయ్య కోరారు. మండలంలోని చందలూరు గ్రామంలో మంగళవారం డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో, పిల్లలకు వాంతులు, విరోచనాలు రాకుండా సురక్షితమైన మంచినీటిని వాడాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. క్లోరినేషన్ చేసిన నీటిని వాడాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ఆయన చెప్పారు. వేడివేడి ఆహార పదార్థాలు మాత్రమే తీసుకోవాలని, వండిన



చందలూరులో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం జరుపుతున్న దృశ్యం

ఆహారంపై దుమ్ము, ఈగలు, ధూళి పడకుండా మూతలు ఉంచుకోవాలని కోరారు. ఇంటిలో ఉన్న మరుగుదొడ్డిని మాత్రమే వాడాలని, మలవిసర్జన తరువాత చేతులను సబ్బుతో కడుక్కోవాలని కోరారు. ఒకటి నుంచి నాలుగుసార్లు నీళ్ల విరేచనాలు అయినవో ఆలస్యం చేయకుండా డాక్టర్లు గానీ, ఏఎన్ఎంను గానీ, ఆశాను గాని సంప్రదించాలని అన్నారు. వాంతులు, విరేచనాలు అయిన యెడల ఓఆర్ఎస్ తాగించాలని కోరారు. బిడ్డకు విరేచనాలు అయితే తల్లి బిడ్డకి పాలు ఇస్తూ ఉండాలని, అవసరమైతే 108 వాహనాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చందలూరు గ్రామసర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, ఉపసర్పంచ్ మోరకొండ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి వందనం, సూపర్‌వైజర్ మదర్ షా, సిహెచ్‌ఓ విష్ణువర్ధన్‌రాజు, ఏఎన్ఎం లలిత, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సేవ ద్వారా ప్రజల్లో గుర్తింపు

రోటరీ గవర్నర్ శరత్ చంద్ర చౌదరి

ప్రజాశక్తి-వేటపాలెం

అంతర్జాతీయ సంస్థ అయిన రోటరీ ద్వారా సేవ చేసి గుర్తింపును, గౌరవాన్ని పొందవచ్చని 3150 జిల్లా గవర్నర్ కె శరత్ చంద్ర చౌదరి అన్నారు. వేటపాలెం రోటరీ కమ్యూనిటీ హాల్లో మంగళవారం 24-25 సంవత్సరానికి రోటరీ కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ ద్వారా ఎన్నో అద్భుతమైన ఫలితాలు సాధించి ప్రజలకు చేరువ అవ్వచ్చని తెలిపారు. 23-24 సంవత్సరానికి ఉత్తమ రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా అవార్డు అందుకున్న బట్ట మోహన్‌రావును ప్రత్యేకంగా అభినందించారు. రోటరీ అధ్యక్ష కార్యదర్శులుగా ఎంపికైన ఏవి సురేష్‌బాబు, వి లక్ష్మణ స్వామి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. రోటరీ జిల్లా జాయింట్ సెక్రెటరీ వి దినేష్‌రెడ్డి మాట్లాడుతూ క్లబ్ సభ్యులు పెరిగేందుకు ఒక ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని సూచించారు. నూతన సభ్యులుగా చేరిన రొండా దశరథ రామిరెడ్డి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అంతర్జాతీయ పారా ఒలంపిక్ వాలీబాల్ క్రీడాకారుడు పిచ్చుక



రోటరీ ప్రతినిధులను సన్మానిస్తున్న దృశ్యం

నాగరాజును రోటరీ గవర్నర్ శరత్ చంద్ర చౌదరి ఘనంగా సన్మానించారు. ఈ సమావేశానికి రోటరీ క్లబ్ అధ్యక్షుడు బట్ట మోహన్‌రావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో చీరాల రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు డాక్టర్ ఐ బాబురావు, మాజీ అసిస్టెంట్ గవర్నర్ ఎం సుధీర్ కుమార్, వేటపాలెం రోటరీ వ్యవస్థాపక అధ్యక్షులు గొల్లపూడి సీతారాం, మాజీ అధ్యక్షులు కొత్త శ్రీనివాసరావు(వాసు), పొగడదండ రవికుమార్, పింజల ప్రసాద్, డాక్టర్ శివరామకృష్ణ, సున్న నాగేంద్రరావు, బాపట్ల రోటరీ అధ్యక్షులు ఉపేంద్ర గుప్తా, చీరాల రోటరీ అధ్యక్షులు బాల వెంకటేశ్వర్లు, గ్రామ ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు

ప్రజాశక్తి-పంగులూరు

ఒక వ్యక్తిపై దాడి చేసి, హత్య చేయబోయిన సంఘటనలో నిందితుడికి న్యాయమూర్తి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించినట్లు, రేణింగివరం ఎస్ఐ కేకే తిరుపతిరావు మంగళవారం తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాల ప్రకారం.. మండలంలోని భగవాన్ రాజుపాలెం గ్రామానికి చెందిన జంగ్రాజు పల్లి కృపారావును, అదే గ్రామానికి చెందిన చింతల చెరువు పెద్ద అంజయ్య 2000 సంవత్సరం డిసెంబర్ ఐదవ తేదీన పొలం దగ్గర కొడవలితో మెడ కింద నరికి చంపబోయే ప్రయత్నం చేశాడు. ఫిర్యాది జంగ్రాజుపల్లి కృపారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి రేణింగవరం ఎస్ఐ ఎం శ్రీనివాసరావు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు. సంబంధిత కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. అద్దంకి అసిస్టెంట్ సేషన్స్ కోర్టులో కేసు విచారణకు రావడంతో, బాపట్ల జిల్లా ఎస్పీ వకూల్ జిందాల్ ఆదేశాల మేరకు అద్దంకి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏ శివరామ కృష్ణారెడ్డి, రేణింగవరం ఎస్ఐ కేకే తిరుపతిరావుల పర్యవేక్షణలో, కోర్టు కానిస్టేబుల్ పి వీరబ్రహ్మం సాక్షుల ద్వారా సరైన పద్ధతిలో నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చి, సరైన సమయంలో కోర్టుకు హాజరు పరిచారు. పిపిఎస్ కుసుమలత కోర్టులో వాదనలు వినిపించగా నిందితులపై మోపబడిన నేరాన్ని నిరూపించారని ఎస్ఐ తిరుపతిరావు చెప్పారు. అద్దంకి అసిస్టెంట్ సేషన్స్ కోర్టు న్యాయమూర్తి డి నాగ వెంకటలక్ష్మి నిందితుడు చింతలచెరువు పెద్దఅంజయ్యకు మంగళవారం ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు ఐదు వేల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా దర్యాప్తు అధికారులు భౌతిక ఆధారాలను, కోర్టుకు సమర్పించి నిందితుడికి శిక్ష పడేలా చేసిన పోలీసు అధికారులను, కోర్టు మానిటరింగ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ వకూల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించినట్లు ఆయన తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-పంగులూరు

అక్రమంగా తరలిస్తున్న 27.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పర్చూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గంగవరపు గీతారాణి పట్టుకున్నట్లు రేణింగవరం ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు. ఇంకొల్లు నుంచి పంగులూరు మీదుగా ఒంగోలుకు అక్రమ రేషన్ బియ్యాన్ని ముప్పవరం దగ్గర పట్టుకున్నారని తెలిపారు. బియ్యాన్ని ముప్పవరంలోని ఒక డీలర్ దగ్గర ఉంచినట్లు తెలిపారు. డ్రైవర్ పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన గుమ్మడి వాసు బాబును అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతిరావు చెప్పారు.

రైతుల పట్ల నిర్లక్ష్యం లేదు: ఎస్ఐ

ప్రజాశక్తి-పంగులూరు

రైతుల పట్ల తనకెప్పుడూ నిర్లక్ష్యం లేదని, రైతుల సమస్యలు పరిష్కరించడంలో తాను ఎప్పుడూ ముందుంటానని రేణింవరం ఎస్ఐ కేకే తిరుపతిరావు అన్నారు. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నామని రైతు సంఘం నేతలు విమర్శించటం సరైనది కాదని ఆయన అన్నారు. పంగులూరు మండలంలో వ్యవసాయ విద్యుత్ పంప్‌సెట్‌లకు అమర్చిన ట్రాన్స్ ఫార్మర్లను దొంగలు తీసుకెళుతున్న విషయం తెలిసిందే. ఈ విషయమై రైతులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా సకాలంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం వలన రైతులు నష్టపోతున్నా రని, రైతుల పట్ల పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సోమవారం పంగులూరు లోని విద్యుత్ సబ్ స్టేషన్ ముందు జరిగిన ధర్నాలో రైతు సంఘం నాయకులు విమర్శించిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ విషయమై రేణింగవరం ఎస్ఐ



రేణింగవరం ఎస్ఐ కేకే తిరుపతిరావు

కేకే తిరుపతిరావు చర వాణిలో 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. తాను రైతుల నుంచి ఫిర్యాదు అందిన 15 రోజుల్లోపే ఎఫ్ఐఆర్ నమోదు చేశానని, ఆ ఎఫ్ఐఆర్‌లను తీసుకెళ్లి ట్రాన్స్‌ఫార్మర్లను బిగించాల్సిన బాధ్యత విద్యుత్ అధికారులదని అన్నారు. రైతుల పట్ల విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే అది పోలీసులపై మోపటం సరైంది కాదని ఆయన చెప్పారు. మండలంలో ప్రత్యేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల బారిన పడుతున్న మాట నిజమేనని, తాము శక్తివంచన లేకుండా దొంగలను పట్టుకుంటున్నామని, ఎఫ్ఐఆర్‌లు సకాలంలో రాసి రైతులకు సహకరిస్తున్నామని ఎస్ఐ తిరుపతిరావు చెప్పారు. గత సంవత్సరం దొంగలు తీసుకెళ్లిన ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి తమ దగ్గర పెండింగ్ లేవని, ఈ సంవత్సరం చోరీకి గురైన ఆరు ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి ఎఫ్ఐఆర్ తయారు చేశామని ఎస్ఐ తెలిపారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-వేమూరు

మండలంలోని ఎరువులు పురుగు మందులు విత్తనాల దుకాణాలను మంగళవారం వ్యవసాయ శాఖ మరియు విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్ఐ నాగేశ్వరరావు బాపట్ల జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్ రవికుమార్‌లు పద్మావతి ట్రేడర్స్ సాయి ఎంటర్‌ప్రైజెస్ మరియు గోపీచంద్ ఏజెన్సీ సీడ్స్ దుకాణాలలో తనిఖీ నిర్వహించారు. అదేవిధంగా జంపని గ్రామంలో గల పీజీఎం ఆగ్రో కేర్ తయారీ కేంద్రాన్ని కూడా వారు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించినట్లు మండల వ్యవసాయ అధికారి చందోలు సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎస్ఐ అధికారి తిరుమల్ రావు, లూదియా, రమేష్‌రెడ్డి వీఏఏ ఉన్నారు.

అమర్తలూరు (చెరుకుపల్లి)

అమర్తలూరు మండల కేంద్రంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలను వ్యవసాయ శాఖ మరియు విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్ఐ నాగేశ్వరరావు, సహాయ వ్యవసాయ సంచాలకులు రవికుమార్, అమర్తలూరులోని సుమాంజలి ట్రేడింగ్ కార్పొరేషన్, సతీష్ ట్రేడర్స్, కీర్తి సీడ్స్ దుకాణాలలో రికార్డులు, స్టాకులు పరిశీలించారు. కార్యక్రమంలో అమర్తలూరు మండల వ్యవసాయ శాఖ అధికారిని ఉయ్యూరు లోకేశ్వరి, బాపట్ల జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ సిబ్బంది తిరుమలరావు, సిబ్బంది పాల్గొన్నారు.



నోట్ పుస్తకాలతో విద్యార్థులు

'ఎంఎంఆర్' సేవలు అభినందనీయం

సంతనూతలపాడు ఎంఈఓ వెంకారెడ్డి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

విద్యార్థులకు, వృద్ధులకు అవసరమైన సేవలు అందిస్తూ ఎంఎంఆర్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని, ఫౌండేషన్ ప్రతినిధి థామస్ సేవా నిరతికి ఇది నిదర్శనమని సంతనూతలపాడు మండల విద్యాశాఖ అధికారి వెంకారెడ్డి అన్నారు. పేర్నమిట్ట శాంతినగర్‌లో డాక్టర్ నూకతోటి రవికుమార్ నేతృత్వంలో నిర్వహిస్తున్న అంబేద్కర్ స్టడీ సర్కిల్ ట్యూషన్ సెంటర్లో మక్కెన మరియా రోజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు మంగళవారం ఉచిత నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ రవికుమార్ అధ్యక్షత వహించారు. మక్కెన థామస్ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల పేరు మీద చేస్తున్న ఈ కృషి సార్థకం అవుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రైజ్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ రాజ్‌కిరణ్, త్రైక్వాండో అధ్యాపకుడు కోమల శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు కైలా విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పేర్నమిట్టకు చెందిన అబ్దుల్ గఫూర్ అనే బాలుడు తన తల్లిదండ్రులు చనిపోవడంతో వృద్ధురాలు నాయనమ్మ మహబూబి సంరక్షణలో ఉన్నాడు. షేక్ అబ్దుల్ గఫూర్ సమతానగర్‌లోని సాయి కాన్వెంట్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. చదువులో మంచి ప్రతిభ చూపిస్తున్నాడు. కానీ స్కూల్ ఫీజు, పుస్తకాలు కొనే ఆర్థిక స్తోమత లేకపోవడంతో సూర్యశ్రీ ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్‌బాషాను సంప్రదించారు. స్పందించిన ఆయన ప్రవాస భారతీయుడు, దాత కుర్ర అనిల్‌కుమార్‌తో మాట్లాడారు. అబ్దుల్లా స్కూల్ ఫీజు, పుస్తకాల నిమిత్తం రూ.15 వేలను ట్రస్టు కార్యాలయంలో చైర్మన్ సయ్యద్ షహనాజ్, సర్దార్‌బాషా ద్వారా అందజేశారు.



సాయం అందిస్తున్న షహనాజ్, సర్దార్‌బాషా



పాఠశాలను పరిశీలిస్తున్న కమిషన్ సభ్యులు

గురుకుల పాఠశాలను పరిశీలించిన చైల్డ్ రైట్స్ కమిషన్

ప్రజాశక్తి-యద్దనపూడి

స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలను మంగళవారం చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యురాలు పద్మావతి పరిశీలించారు. పాఠశాలలో తాగునీరు, వాడుక నీరు, డ్రైనేజీ సమస్యల గురించి ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. భోజనం మరియు ఇతర సమస్యల గురించి విద్యార్థులను అడిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థినిలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చూడాలని మండల అధికారులకు చెప్పారు. తాను గుర్తించిన సమస్యలను గురించి జిల్లా అధికారులకు నివేదిక పంపుతానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివ సుబ్రహ్మణ్యం, ఎంఇఒ గోపి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ బ్రహ్మయ్య, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వాణి బాల, సిడిపిఒ సుభద్ర పాల్గొన్నారు.

జిల్లాలో 10.6 మి.మీ.ల వర్షపాతం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో జిల్లాలో 10.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పొన్నలూరులో 54.4 మిల్లీమీటర్లు, మద్దిపాడులో 39.4, జరుగుమల్లిలో 37.2, ఒంగోలులో 34.2, రాచర్లలో 32.2, శింగరాయకొండలో 27.4, నాగులుప్పల పాడులో 26.2, కొమరోలులో 17.8, గిద్దలూరులో 123.4, సంతనూతలపాడులో 10.8, కొత్తపట్నంలో 9.8, కొండపిలో 9.2, బేస్తవారపేటలో 8.2, దర్శిలో 7.8, ముండ్లమూరులో 7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దొనకొండలో 6.4 మిల్లీమీటర్లు, టంగుటూరులో 5.4, కంభంలో 5.4, పెద్దార వీడులో 4, పిసిపల్లిలో 3.2, కొనకనమిట్లలో 2.8, అర్ధవీడులో 2.8, చీమకుర్తిలో 2.4, మార్కాపురంలో 2.4, కనిగిరిలో 2, మర్రిపూడిలో 2, సిఎస్‌పురంలో 1.4, తర్లుపాడులో 1, పామూరులో 1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కురిచేడు, తాళ్ళూరు, హెచ్‌ఎంపాడు, వెలిగండ్ల, పొదిలి, దోర్నాల, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లల చెరువు మండలాల్లో వర్షం కురవలేదు.

మాతృమరణాల నివారణకు చర్యలు

- గర్భిణీలకు సరైన వైద్యసేవలందించాలి
- అధికారులకు డిఎంహెచ్ఒ డాక్టర్ డి.సురేష్‌కుమార్ ఆదేశం



సమీక్ష నిర్వహిస్తున్న డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో మాతృ మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారులు, సిబ్బందిని అధికారులను ఆదేశించారు. స్థానిక డి.ఎం,హెచ్ఒ ఛాంబర్‌లో మంగళవారం మాతమరణాల సబ్ కమిటీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలను నమోదు చేసి వారికీ సకాలంలో సేవలు అందించాలన్నారు. గర్భిణీల అన్ని వివరాలను ఆర్‌సిహెచ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రమాద సంకేతాలు ఉన్న గర్భిణీలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి వారి బర్త్ ప్లాన్ ను తయారు చేయాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం వైద్యాధికారి పర్యవేక్షణలో వారికి సేవలను అందించాలన్నారు. అత్యవసర సేవలు అవసరమైతే గర్భిణీలను ఆశ, ఎఎన్ఎం సమీపంలోని ఏరియా ఆసుపత్రికి, సర్వజన ఆసుపత్రికి లేదా ఎంసిహెచ్‌కి సకాలంలో 108 వాహనంలో తరలించాలన్నారు. ఆసుపత్రిలో సంబంధిత గర్భకోశ నిపుణుల ద్వారా గర్భిణీకి అన్ని సేవలు అందించేలా చూడాలన్నారు. గర్భిణీలను ప్రతి నెల 10వ తేదీ జరిగే ప్రధానమంత్రి మాతవందన యువజన కార్యక్రమానికి తీసుకొని వచ్చి అక్కడ అవసరమైన అన్ని వైద్య పరీక్షలు, స్కాన్ చేయించి ఆ వివరాలను కుటుంబ సభ్యులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో డిఐఒ డాక్టర్ పద్మజ, వైద్య అధికారులు, సర్వజన ఆసుపత్రి ప్రసూతి విభాగాధిపతి, మత్తు మందు విభాగాధిపతి, ప్రవేట్ ఆసుపత్రుల ప్రతినిధులు, దొనకొండ , చెట్లమిట్ట , పుల్లచెరువు వైద్యాధికారులు, సిబ్బంది, డిపిహెచ్ఎన్ఒ సుగుణమ్మ, ఉప మాస్ మీడియా అధికారి సరోజిని పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

శానిటేషన్ సిబ్బందితో కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

వర్షాకాలం ప్రారభమై, వాతావరణంలో అనేక మార్పులు వస్తున్నందున నగర ప్రజలు ఎవరూ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నగరపాలక సంస్థ శానిటేషన్, సచివాలయ సిబ్బందిని కమిషనర్ ఎం. జస్వంతరావు ఆదేశించారు. నగరంలో సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలు, పారిశుధ్యం మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలు, తాగునీటి సరఫరా మెరుగుదల తదితర విషయాల మీద సోమవారం ఆయన కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సమీక్షించారు. డయేరియా, మలేరియా, డెంగ్యూ, ఇతర వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని, ఈ విషయంలో ప్రజలకు ఎప్పటికప్పుడు వార్డుల్లో తిరుగుతూ అవగాహన కల్పించాలని సూచించారు. శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు వారి పరిధిలోని మస్టర్‌ప్లాయింట్లను, డివిజన్‌లను ప్రతి రోజు సందర్శించి డివిజన్‌లలో జరిగే పారిశుధ్య పనులు పర్యవేక్షించాలని చెప్పారు. కాల్వల శుభ్రత మీద దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రవీంద్ర, హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ ఎన్.పిచ్చయ్య, ఇన్స్‌పెక్టర్ షేక్ బాజ్జీ పాల్గొన్నారు.

ఈ నెలాఖరుకు ఉపాధ్యాయుల సర్దుబాటు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెలాఖరుకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాశక్తి దినపత్రిక జిల్లా పేజీలో ఈ నెల 9న ప్రచురితమైన 'ఫలితాలు ఘనం..ఉపాధ్యాయులే స్వల్పం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. వార్తకు స్పందించిన మండల విద్యాశాఖాధికారి బి.మస్తాన్‌నాయక్ పెద్దదోర్నాల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 15 మంది ఉపాధ్యాయులతోనే పాఠశాలను నిర్వహిస్తున్నామని, 41 మంది ఉపాధ్యాయులు ఉండాలని జిల్లా విద్యాశాఖా అధికారికి తెలియజేశారు. అయినప్పటికీ ఉన్న ఉపాధ్యాయులతో సర్దుబాటు చేసుకొని తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్పందించిన జిల్లా విద్యాశాఖాధికారి ఈ నెల చివరినాటికి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయడం జరుగుతుందని, మిగిలిన ఉపాధ్యాయులను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియమిస్తామని డిఇఒ తెలిపినట్లు ఎంఇఒ ప్రజాశక్తికి చెప్పారు.

నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు చర్యలు

- 11 నుంచి రైతు బజార్లలో కౌంటర్లు ఏర్పాటు
- అధికారులకు జెసి గోపాలకృష్ణ ఆదేశం



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతు బజార్లల్లో కంది పప్పు బియ్యం విక్రయాలకు కౌంటర్లు ఏర్పాటు చేయాలని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానంలో భాగంగా ప్రకాశం జిల్లాలో తీసుకోవాల్సిన చర్యలపై మీకోసం సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. వివిధ విభాగాల అధికారులు, బియ్యం కందిపప్పు మిల్లుల యజమానులు, వ్యాపారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ బియ్యం, కందిపప్పు అమ్మడానికి నగరంలోని మూడు రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ కౌంటర్లలో మంచి నాణ్యమైన బిపిటి బియ్యం (స్టీమ్ చేసినవి) కిలో రూ.49, పచ్చి బియ్యం కిలో రూ.48కే అందుబాటులో ఉంటాయన్నారు. కందిపప్పు కూడా కిలో రూ.160కు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఏ.ఉదయభాస్కర్, సివిల్ సప్లై డిఎం సత్యనారాయణ, బియ్యం, కందిపప్పు మిల్లుల యజమానులు, వ్యాపారులు పాల్గొన్నారు.

రైతు బజార్ల సందర్శన

అనంతరం బియ్యం, కందిపప్పు విక్రయించేందుకు అవసరమైన కౌంటర్ల ఏర్పాటుపై ఒంగోలు నగరంలోని మూడు రైతు బజార్లను జెసి ఆర్.గోపాలకృష్ణ మంగళవారం సందర్శించారు. రైతు బజార్‌లలో మౌలిక సదుపాయాలు పట్ల అసంతృప్తి వ్యక్తపరిచారు. సాయిబాబా గుడి వద్ద ఉన్న రైతు బజార్‌లో కాల్వలు పూర్తి చేయాలని, పారిశుధ్యం మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. దిబ్బలరోడ్డు రైతుబజార్‌లో ప్రజలు, రైతుల కోసం ఆర్ఒ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కొత్తపట్నం రైతు బజార్‌లో పారిశుధ్యం మెరుగుపరచాలని, టాయిలెట్ల నిర్వహణ మరింత మెరుగుపడాలని సూచించారు. మంచినీటి సౌకర్యానికి లోటు ఉండకూడదని, రైతు బజార్‌లలోకి వెళ్లే, వచ్చే దారులు సక్రమంగా నిర్వహించాలని జెసి అధికారులను ఆదేశించారు. కంది పంట విషయంలో జిల్లా వ్యవసాయ అధికారులు మరింత కషి చేసి విస్తీర్ణాన్ని పెంచాలని సూచించారు. జెసి వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి ఏ.ఉదయ భాస్కర్, సివిల్ సప్లై డిఎం సత్యనారాయణ, ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్‌రావు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



మంత్రి లోకేష్‌తో మాగుంట

మంత్రి లోకేష్‌ను కలిసిన ఎంపీ మాగుంట

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖల మంత్రి నారా లోకేష్‌ను ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నివాసంలో మంత్రి నారా లోకేష్ కలసి పలు విషయాలు చర్చించారు. కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు కష్ణదేవరాయలు, టిడిపి యువ నాయకులు మాగుంట రాఘవ రెడ్డి పాల్గొన్నారు.

సర్పంచులపై కక్ష సాధింపులకు పోవద్దు


ప్రభుత్వానికి జి.వీరభద్రాచారి విజ్ఞప్తి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం సర్పంచ్‌లపై కక్ష సాధింపు చర్యలు దిశగా అడుగులు వేయవద్దని సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రా చారి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పంచాయతీలకు వ్యతిరేకంగా చేపట్టిన అనేక దోపిడీ విధానాలకు సర్పంచ్‌లు వ్యతిరేకించి కూటమికి సహకరించారన్నారు. వైసిపి ప్రభుత్వ విధానాలకు విసిగివేసారిన సర్పంచ్‌లు సిఎం చంద్రబాబు నాయుడు పంచాయతీల ప్రయోజనాలకు ఇచ్చిన హామీ మేరకు కూటమి వైపు మొగ్గు చూపారన్నారు. ఈ విషయాన్ని కూటమిలోని తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీల నాయకత్వాలు గుర్తించి మెలగాలని తెలిపారు. ఉపాధి హామీ తదితర పనులు, చేసిన బిల్లుల చెల్లింపు విషయంలో అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థుల్లో సేవాదృక్పథం పెంపొందించాలి

జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యార్థులలో చిన్ననాటి నుంచి సేవా దృక్పథం పెంపొందించాలని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర తెలిపారు. స్థానిక సమగ్ర శిక్ష కార్యాలయంలో మంగళవారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా కార్యదర్శి తన్నీరు బాలాజీ అధ్యక్షత వహించారు. తొలుత గత 20 సంవత్సరాల నుండి జిల్లా కార్యదర్శిగా పనిచేసి ఇటీవల మరణించిన అన్నం రాజు సుబ్బారావుకు నివాళులర్పించారు. సమావేశా నికి ముఖ్య అతిథిగా డిఇఒ, భారత్ సౌత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా చీఫ్ కమిషనర్ డి.సుభద్ర మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో సేవా దృక్పథం పెంపొందించటమే స్కౌట్స్ అండ్ గైడ్స్ లక్ష్యమన్నారు. ప్రకాశం జిల్లా పరిధిలోని అన్ని పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రూప్స్ ఏర్పాటు చేయాలని, కార్యక్రమాలు ప్రతినెలా ఉండే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులందరూ ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని, స్కౌట్స్ ఉద్యమం బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని సమయం ఎల్లప్పుడూ కేటాయిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా స్కౌట్ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని, కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారని, స్కౌట్ విద్యార్థులకు నీట్, ఐఐటీలోనూ రిజర్వేషన్స్ ఉన్నాయని విద్యార్థుల భవిష్యత్తు కోసం స్కౌట్ ఉపయోగపడుతుందని తెలిపారు. సమావేశంలో ఒంగోలు ఎంఈఓ తిరుపతి కిషోర్‌బాబు, సంతనూతలపాడు ఎంఈఓ డి.వెంకా రెడ్డి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కోశాధికారి పర్రె వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు హెప్సిబా, చెక్క వెంకటేశ్వర్లు, కె.రాము, రత్నకుమార్, కె.దేవసహాయం, పి రాచయ్య, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

'పీజీ'లో 'శ్రీ హర్షిణి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం నిర్వహించిన పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలలో శ్రీహర్షిణి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ విద్యార్థి యూనివర్సిటీ మొదటి ర్యాంక్ సాధించారు. అందులో ఎంఎస్‌సి కంప్యూటర్ సైన్స్ 70 మంది విద్యార్థులు హాజరుకాగా 64 మంది విద్యార్థులు ఉత్తీర్ణతను అందుకున్నారు. కటారి యామిని 700 మార్కులకు గాను 634 మార్కులు సాధించి యూనివర్సిటీ మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు వి.హర్షిత 628 మార్కులతో రెండో స్థానాన్ని, కె. గౌతమి 621 మార్కులతో తతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఎమ్ఎస్‌సి కెమిస్ట్రీలో 56 మంది విద్యార్థులు హాజరుకాగా 50 మంది ఉత్తీర్ణత సాధించారు. చెరుకూరి మహిత 650 మార్కులకు గానూ 566 మార్కులతో యూనివర్సిటీ మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు .జి భావన 552 మార్కులతో రెండవ స్థానాన్ని, కే హేమ 546 మార్కులతో తతీయ స్థానాన్ని సాధించారు. ఎంఎస్‌సి మ్యాథమెటిక్స్ 38 మంది విద్యార్థులు హాజరుకాగా 30 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినారు. అందులో గుండ్రెడ్డి స్వప్న 600 మార్కులకు గాను 483 మార్కులతో యూనివర్సిటీ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు 480 మార్కులతో జి పుష్పలత .రెండవ స్థానాన్ని, టి సంపత్ కుమార్ 472 మార్కులతో మూడో స్థానం అందుకున్నారు. ఎమ్ఎస్‌సి ఫిజిక్స్‌లో యూనివర్సిటీ స్థాయిలో కేవలం ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించగా అందులో ఇద్దరు విద్యార్థులు శ్రీహర్షిణి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ వారు కావడం గర్వకారణమని విద్యాసంస్థల అధినేత గోరంట్ల రవికుమార్ తెలియజేశారు.